''ఓరి దేవుడా! పిల్లకేటయింది!?'' అంటూ అమ్ములిని కిందికి దింపాడు.

అతని మెడ వంక చూసిన సావిత్రి..

''మంగా! పిల్ల పెద్ద మనిసయినట్టుగున్నదే! చూడు మన కట్టాలకి తోడు ఇప్పుడయిందేటే..'' అని మంగతో అన్నది.

''ఓమ్మో! ఇప్పుడేం జేసెడిది? ఈ దార్ల దీన్ని ఎట్ల జూసుకోవాల్నె? తాటాకేసి ఇశ్రాంతిగా కూసోబెట్టి.. సక్కగ అన్ని తినబెట్టి జూడాల్సిన దినమాయే! నేనేం జేసెడిది దేవుడా..'' అంటూ మంగవేణి ఏడుపు మొదలుపెట్టింది.

''ఇకూర్కో.. అసలికి తప్పంత నీదే! ఈ ఈడుపిల్లను తీసుకుని నువ్వు ఊరొదిలి రావడం తప్పేగాదేటి!? అల్ల దిగో.. ఆ చెట్టు పక్కన మరుగున్నది. తీసుకెళ్లి ఆ గుడ్డలు మార్చి, ఏటి సెయ్యాలో సేసి తీసుకురా!'' గదమా యిస్తూ అన్నాడు సావిత్రి భర్త ఓబులేసు.

''బిడ్డ ఎదుగుతాంది. నాయన లేడు గందా! నేనే పైసలు కూడబెట్టి, దాసిపెట్టాల్నని ఆశ పడ్డగానీ.. గింత కష్టమైతదనుకోలా! అత్తా.. గది అమ్మోరు తల్లి చెట్టులా గుందే!? ఎట్టా!? అంటయితదేమో''.. అమ్ములిని తీసు కెళ్లబోయి ఆగి అన్నది మంగ.

''ఏటి మాటాడుతున్నవు వదినా? 'అంటు గింటు' అంటవేటి? అమ్మోరు ఆడది గాదేటి? ఆ తల్లికి లేకుండ ఇలాంటి కట్టాలు మీ ఆడోల్లకిచ్చిందేటి? ఎల్లొదినా పని సూడు''.. ఒంటి మీది అంగీ విప్పి పక్కకు విసిరేసి.. అక్కడున్న బోరు కొట్టుకుని, భుజాలు శుభ్రంగా కడు క్కుంటూ అన్నాడు సైదులు.

''నావల్ల మీకందర్కి ఆలస్యం అయిపోతుండే. నా తిప్పలు నేం బడత.. మీరంత బోండ్రి. ఈడే యాడో ఈ రాత్రికి బండి.. తెల్లారె బిడ్డా నేను నడిచొస్తం''.. అన్నది మంగ.

'సరే!' అంటూ నడక మొదలు పెట్టారంతా. కానీ, చుట్టూ ఒక్క ఇల్లన్నా లేకుండా, అంత నిర్మానుష్యంగా ఉన్న ఆ చోట.. ఆ తల్లీబిడ్డల్ని వదిలి పోడానికి మనసు రాలేదు సైదులకు, ఓబులేసుకు, సావిత్రికి.

'ఏనాటి బంధమో!?' అనుకుంటూ అక్కడే ఆగిపో యారు. ఆ చెట్టు కిందే ఆ రాత్రి విశ్రాంతి తీసుకుని.. తెల్ల వారి లేచి, బ్యాగులో ఉన్న రొట్టెలను పంచుకు తిని, నడక మొదలుపెట్టారు.

ఇంచుమించు ఖమ్మం దరిదాపులకొచ్చేశాక.. వలస కూలీలను ఎక్కించుకునే బస్సు వచ్చింది.

అయితే ఎక్కించుకోడానికి ముందు కొవిడ్ టెస్టు చేసి, నెగెటివ్ వచ్చిన వార్ని ఎక్కనిచ్చారు.

పాజిటివ్ వచ్చిన వారిని క్వారంటైన్‌కు పంపించారు.

**ఆనందంతో వెళ్లి సావిత్రికి విషయం చెబితే.. ఆమె నమ్మలేదు. కానీ, అమ్ములు తృప్తికోసం తనతో కలిసి సైదులు గదిలోకొచ్చింది. అతను లేడు. అతని చెప్పులు లేవు. సావిత్రి ఏదో అర్థమైనట్టు.. ''ఆ తాగుబోతోడి మాట నమ్మినావా.. ఆడు మందుకొట్టుకు పోనాడు.. కావాల్తే సూద్దం నడు'' అంటూ బెల్టు షాపు వైపు అమ్ముల్ని లాక్కెళ్లింది. దారిలో ఉన్న సాయిబాబా గుడి దగ్గర నమస్కరించుకుంటున్న సైదుల్ని చూసి.. ఆశ్చర్యపోతూ దగ్గరికి వెళ్లారు.**

సైదులుకు, ఓబులేసుకు, మంగవేణికి పాజిటివ్ అని క్వారంటైన్‌కు పంపారు.

సావిత్రి, అమ్ములు తమ వాళ్లను వదిలేసి వెళ్లలేరు కాబట్టి అక్కడే ఉండిపోయారు. పద్నాలుగు రోజుల తర్వాత సైదులు మాత్రం ఆరోగ్యంగా బైటికి వచ్చాడు. మంగ, ఓబులేసు అనంతలోకాలకు వెళ్లిపోతే..

మోయలేనంత దుఃఖాన్ని మోసుకుంటూ.. మిగిలిన ముగ్గురూ సావిత్రివాళ్ల ఊరికి చేరుకున్నారు.

క్వారంటైన్‌కు వెళ్తూ..

'అత్తా! నా బిడ్డే..' అని మంగ జాలిగా అన్న మాట గుర్తొచ్చి.. అమ్ముల్ని తనతోనే ఉంచుకుంది సావిత్రి.

ఎప్పుడో పదేళ్ల క్రితం తాగుడుకు బానిసై, మంగవే ణిని వదిలేసిన ఆమె భర్త గురించి మాటల సందర్భంలో చెప్పిన విషయం గుర్తొచ్చి.. అమ్ముల్ని అతని దగ్గరికి పంపిద్దాం! అనుకొని.. అతని గురించి వాకబు చేసింది.

కానీ, బెల్టుషాపులు మూసి ఉండటం వల్ల మందు దొరకక.. మత్తు కోసం రెండు మూడు శానిటైజర్ బాటిల్స్ తాగి.. అతను ప్రాణాలు పోగొట్టుకొన్నాడని తెలిసింది. దాంతో అమ్ములుకు తోడుగా నిలబడింది మనసున్న సావిత్రి.

ఈలోపు సైదులుకు కూడా తన తల్లి కరోనాతో కన్ను మూసిందని ఫోన్ వచ్చింది. ఉన్న ఒక్క పాశమూ కడ సారి చూపులకు కూడా నోచకుండానే దూరమైతే.. ఊరికి వెళ్లి తల్లికి, భార్యా బిడ్డలకు పిండ ప్రదానం చేశాడు. మనసును పిండేసే తనవాళ్ల జ్ఞాపకాలు పదేపదే గుర్తుకు వస్తుంటే.. బాధను పంచుకోడానికి సావిత్రి దగ్గరికే వచ్చాడు. ఇంక మళ్లీ తన ఇంటికి వెళ్లాలనిపించక.. సావిత్రికున్న చిన్న పెంకుటింట్లో ఓ గది అద్దెకు తీసుకున్నాడు. బాధను తట్టుకునే నెపంతో తాగుడుకు బానిసయ్యాడు. కరోనా అలజడి తగ్గాక.. మళ్లీ ఊరెళ్లి, ఇల్లు అమ్ముకుని వచ్చాడు. ఇంటి అద్దెకన్నట్టు సావిత్రికి కొంత డబ్బిచ్చి.. మిగతాది తను మిథ్యాలోకంలో ఉండటానికి ఖర్చు చేస్తున్నాడు.

* * *

ఉదయం లేస్తూనే.. సైదులు విషయంలో ఒక నిర్ణయం తీసుకున్నది అమ్ములు.

ప్లేట్లో ఇడ్లీలు పట్టుకొచ్చి..

''చిన్నాయనా.. లే! మొఖం కడుక్కో.. ఇడ్లీలు తిందువు'' అంటూ కుదిపిలేపింది.

సైదులు లేచి..

''నాకేటి వద్దు ఎల్లు..'' అని విసుక్కున్నాడు.

''లే! నేనుబోను. ఏం దినకుండ మందు తాగితే సచ్చి పోతరని రాత్రి నాయనమ్మ అన్నది. నువు సచ్చిపోతే నేనెట్లా బతికేది!? ఆ దినం నన్ను నీ బిడ్డననుకుని ఎత్తు కుంటివిగా.. నాకైతే మా నాయనెత్తుకున్నట్లే అనిపించే..'' అంటూ మొండిగా గ్లాసుతో నీళ్లిచ్చి.. పుక్కిలించమని బలవంతంగా నోట్లో ఇడ్లీ పెడ్తున్న అమ్ములు వంక చూస్తూ..

'ముందే పుట్టుంటే.. నా కూతురు ఇంతుండేది' అనుకున్నాడు.

''అమ్మూ!'' అన్నాడు.

తన కూతుర్ని 'బుజ్జి' అని పిలిచినా.. 'అమూల్య' అని పేరు పెట్టుకున్నాడు. అందుకే అలా పిలిచాడు.

''ఏంది చిన్నాయన..'' అన్నది.

''చిన్నాయన కాదు.. 'నాన్న' అని పిలుత్తావా! నీ మీదొట్టుగ మందు మానేత్తా. పనికెల్తా.. నిన్ను బడికి పంపుతా..'' అని సైదులు అంటుంటే.. గాల్లో తేలుతున్న ట్టుగా అనిపించింది అమ్ములుకు.

ఆనందంతో వెళ్లి సావిత్రికి విషయం చెబితే.. ఆమె నమ్మలేదు. కానీ, అమ్ములు తృప్తికోసం తనతో కలిసి సైదులు గదిలోకొచ్చింది.

అతను లేడు. అతని చెప్పులు లేవు.

సావిత్రి ఏదో అర్థమైనట్టు..

''ఆ తాగుబోతోడి మాట నమ్మినావా.. ఆడు మందు కొట్టుకు పోనాడు.. కావాల్తే సూద్దం నడు'' అంటూ బెల్టు షాపువైపు అమ్ముల్ని లాక్కెళ్లింది. దారిలో ఉన్న సాయి బాబా గుడి దగ్గర నమస్కరించుకుంటున్న సైదుల్ని చూసి.. ఆశ్చర్యపోతూ దగ్గరికి వెళ్లారు. అతను వాళ్లను వేలితో చూపుతూ..

''బాబా! నీ తోడు. ఈ పొద్దునించి ఇది నా కూతురు. అది మాయమ్మ!'' అని చెప్పి, వాళ్లద్దరి చేతులు పట్టు కుని ఇంటికి తీసుకెళ్తూ.. సావిత్రితో అన్నాడు.

''అమ్మా.. నీకు కంటాప్రీసను చేయిత్తా. ఇంట్లో పని నువ్వే చూస్కో! నా కూతురు బడికెల్తాది. దాన్ని బాగ సదివించి కలక్టర్ని సేత్తా!'' అంటున్న సైదులును చూస్తున్న అమ్ములుకు, సావిత్రికి కొండంత అండ దొరికినట్టు అనిపించింది.

ప్రేమగా చూసే తల్లి పక్షిని పోగొట్టుకున్న బుజ్జి పక్షికి, కడవరకు తోడుగా ఉంటుందనుకున్న జంట పక్షికి దూర మైన ముసలి పక్షికి.. ఏదో ఆసరా దొరికినట్టు సైదులుకు దగ్గరగా జరిగి, అతని చేతుల్ని మరింత గట్టిగా పట్టుకు న్నారు ఇద్దరు.

సైదులుకు మాత్రం తన రెండు చేతులూ పట్టుకుని నడుస్తున్న వాళ్లను చూస్తుంటే.. తనలాంటి రెక్కలు తెగిన వలస పక్షికి కొత్తగా రెండు రెక్కలు మొలిచినట్టుగా.. మళ్లీ ఎగిరేందుకు బలం వచ్చేసినట్టుగా అనిపించింది.■

## దుద్దుంపూడి అనసూయ



అక్క జాస్తి రమాదేవి (రచయిత్రి) ప్రోత్సాహంతో సాహిత్యంపై మక్కువ పెంచుకుని.. అద్భుతమైన కథలు అందిస్తున్నారు దుద్దుంపూడి అనసూయ. తల్లిదండ్రులు ముసునూరి రత్నాంబ – రామారావు. స్వస్థలం రాజమండ్రి సమీపంలోని ములకల్లంక. బాల్యం భద్రా చలంలో గడిపారు. ప్రస్తుతం రాజమండ్రిలో నివాసం ఉంటున్నారు. విద్యార్థి దశ నుంచే శరత్ బాబు, చలం రచనలను ఇష్టంగా చదివేవారు. ఉన్నత విద్యాభ్యాసం తర్వాత.. పల్లె ల్లోని పేద పిల్లలకు ఇంగ్లిష్ నేర్పించాలన్న సేవా దృక్పథంతో ఒక పాఠశాలను స్థాపించారు. బోధనకు తనలోని రచనాశక్తిని జోడించి.. పాఠాలను కొత్తకొత్త కథలుగా చెప్పేవారు. అయితే, కరోనా అలజడి వల్ల ఆ విద్యాసేవను నిలిపేయాల్సి వచ్చింది. అక్క రమాదేవి సలహాతో మళ్లీ కథలు, కవితలు రాయటం మొదలుపెట్టారు. పలు సాహితీ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో.. 'ఈ పసివాళ్లకు ప్రేమకావాలి', 'దొడ్డమ్మ' బహుమతులు దక్కించుకు న్నాయి. కొన్ని కథలు సాధారణ ప్రచురణకు ఎంపికయ్యాయి.